నవతెలంగాణ
నమ్మగ్గ తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | మే 25, 2024 | www.navatelangana.com

పంచాయతీల వారీగా జొన్న టోకెన్ల పంపిణీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం రైతులు పండించిన జొన్న పంటను మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేస్తోంది. అయితే ఇదే అదనుగా భావించిన కొందరు దళారులు రైతుల పేరిట జొన్న పంటను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామ పంచాయతీల వారిగా ఆన్‌లైన్‌లో పంటను నమోదు చేసుకున్న రైతుల పేరిట టోకెన్లు జారీ చేస్తున్నారు. పంచాయతీల వారీగా ప్రకటించిన తేదీల్లో రైతులు పంటను అమ్మకానికి తీసుకు రావాలని కోరారు. ఈ నెల 24 నుంచి 31లోపు జొన్నల కొనుగోలు చేపట్టనున్నట్టు ఆ శాఖాధికారులు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నవతెలంగాణ-సారంగాపూర్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఓ రాజశేఖర్‌రెడ్డి, ఎస్సై చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాల్లోని ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన మందులు విక్రయిస్తే, ఎరువులను అధిక ధరలకు, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఫర్టిలైజర్ విత్తన దుకాణాల్లో రైతులకు విక్రయించిన రైతు వివరాలు రోజువారీగా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే రైతుకు రశీదు తప్పనిసరి ఇవ్వాలని దుకాణదారులను ఆదేశించారు.



అమాయకులే టార్గెట్..!

- నకిలీ విత్తనాలు అంటగడుతున్న అక్రమార్కులు
- అధిక దిగుబడి ఆశ చూపుతూ విక్రయాలు
- గుట్టుచప్పుడు కాకుండా పల్లెలకు..రహస్య ప్రాంతాల్లో నిల్వ
- దుకాణాలు..డీలర్ల ద్వారా రైతులకు పంపిణీ
- తాజా తనిఖీల్లో పట్టుబడుతున్న అనుమతి లేని విత్తనాలు

ఖరీఫ్ సీజన్ రాగానే నకిలీ విత్తనాలు లభ్యం కావడం కలకలరం రేపుతోంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం అదే పరిస్థితి పురావృతమవుతోంది. నిరక్షరాస్యులు..అమాయక రైతులే టార్గెట్‌గా నకిలీ విత్తన ముఠాలు చెలరేగిపోతున్నాయి. అనుమతి లేని విత్తనాలు అన్నదాతలకు అంటగడుతూ అందినకాడికి దండుకుంటున్నాయి. ఇప్పటికే దహెగాం మండలంలో నకిలీ విత్తనాలు పట్టుబడగా.. తాజాగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రూ.19.35లక్షల విలువ గల అనుమతి లేని పత్తి విత్తనాలు పట్టుబడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజుల క్రితమే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ గోదాంలో క్వింటాళ్ల కొద్దీ లూజ్ విత్తనాలు నిల్వ చేసి వాటిని వివిధ కంపెనీల పేరిట ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపుతూ దుకాణాలకు సరఫరా చేయడం కలకలం రేపుతోంది. తాజాగా కచ్చితమైన సమాచారంతో సదరు గోదాంపై దాడిచేసిన అధికారులు ఇక్కడ విక్రయించేందుకు అనుమతిలేని పత్తి విత్తనాలు పట్టుకోవడంతో స్థానిక రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి వ్యవహారాలు ఇంకా ఎన్ని చోట్ల ఉన్నాయోననే భయాందోళన చెందుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అధిక విస్తీర్ణం..మారుమూల ప్రాంతాలు..అమాయక రైతులు అధికం కలిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాలు లభ్యం కావడం సాధారణ విషయంగా మారుతోంది. ప్రతి ఏటా వీటిని పూర్తిగా నిర్మూలిస్తామని చెబుతున్న అధికారుల మాటలు ఆచరణలో సాధ్యం కావడం లేదు. రైతుల అమాయకత్వం..అధికారుల ఉదాసీనత వైఖరి కారణంగా నకిలీ విత్తన ముఠాలు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఆంధ్రా, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడకు క్వింటాళ్ల కొద్దీ అనుమతి లేని విత్తనాలను సరఫరా చేస్తున్నారు. స్థానిక డీలర్లను మధ్యవర్తులుగా నియమించుకొని వారి ద్వారా పల్లెలకు చేరవేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో ఆదివాసీ గ్రామాలు, మారుమూల పల్లెల్లోనే వీటిని అధికంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల దుకాణాల ద్వారా రైతులకు వీటిని అంటగడుతున్నారు. వారు చెప్పిన విత్తనాలు వేస్తే బ్యాగుకు క్వింటాల్‌కు 15 నుంచి 20క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని..పురుగు మందులు కూడా అధికంగా వాడాల్సిన అవసరం ఉండదని.. కాత..పూత కూడా పుష్కలంగా వస్తుందని ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపుతూ వీటిని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా కంపెనీల గురించి ఎక్కువగా తెలియని రైతులు వీరి మాటలను నమ్మి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా వాటిని పొలంలో వేసిన తర్వాత మొలకలు రాకపోవడం.. వచ్చినా పంట ఎదుగుదల లేకపోవడం..కాత, పూత లేకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నం కాగానే తాము నష్టపోయామని బాధపడుతుండటం సాధారణంగా మారుతోంది.

కేసులు సరే.. చర్యలు ఏవీ..?

అధికారుల తనిఖీల్లో ప్రతి ఏటా నకిలీ విత్తనాలు పట్టుబడుతున్నాయి. సీజన్ ముందుగానే ఆయా పల్లెలకు చేరడం.. డీలర్లు పల్లెలకు నేరుగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. నేరుగానే కాకుండా జిల్లా, మండల కేంద్రాల్లోని కొన్ని దుకాణాల ద్వారా వీటిని రైతులకు అంటగడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడ విక్రయించేందుకు అనుమతి లేని కంపెనీల పేరిట విక్రయాలు చేపడుతూ రైతులను నట్టేటా ముంచుతున్నారు. అధికారులు గతంలో నార్నూర్, వాంకిడి, గాదిగూడ, ఉట్నూర్, ఇచ్చోడ, సిరికొండ తదితర మండలాల్లో అనుమతి లేని పత్తి విత్తనాలు పట్టుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పట్టుబడిన దుకాణాలను బ్లాక్ లిస్టులో పెడుతామని, లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. కానీ కేసులు మాత్రమే నమోదు చేసిన అధికారులు ఎవరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలున్నాయి. ప్రతి ఏటా జరిగే ఈ వ్యవహారాన్ని మామూలుగా తీసుకుంటూ మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు అధికారులు దుకాణాల యజమానులు, డీలర్లతో కుమ్మక్కు కావడంతోనే చర్యలు లేకుండా పోయాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

ముఖ్యంగా సీజన్ ప్రారంభంలోనే చేపట్టాల్సిన తనిఖీలను అధికారులు పట్టించుకోకపోవడం కారణంగానూ ఈ ఏడాది సైతం ఈ నకిలీ విత్తనాల కలకలం రేపుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వారం రోజుల క్రితమే టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటుచేసి తనిఖీలు చేపట్టగానే ఆదిలాబాద్ జిల్లాలో అనుమతి లేని విత్తనాలు పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. ముందస్తుగానే తనిఖీలు చేపట్టి ఉంటే నకిలీల నివారణ కొంత వరకైనా సాధ్యమయ్యేదనే అభిప్రాయం రైతుల నుంచి వినిపిస్తోంది.

నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం : పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జిల్లాలో నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపేందుకు నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. వీటిని నివారించేందుకు ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటుచేశాం. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నాయి. జిల్లాలోని దుకాణాల్లోనూ తనిఖీలు చేపట్టి అనుమతి లేని విత్తనాలు విక్రయించకుండా చర్యలు తీసుకుంటాం.





విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

మండలంలోని దోస్తునగర్, లక్ష్మీపూర్, నవాబ్‌పేట్, అంబారిపేట్, పాండ్వాపూర్, ఉపరిగూడెం, బెల్లాల్, చిట్యాల్, చిట్యాల్ గోండుగూడ, ఎల్లగడప, పాతమద్దిపడగ, లింగాపూర్ తదితర గ్రామాలలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విస్తృతంగా పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై గ్రామాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఉట్నూర్ నుండి కడెం మీదుగా వెళ్లే రహదారిపై ఈదురు గాలులతో నెలకొరిగిన చెట్లను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంబారిపేట్ గ్రామంలో వ్యవసాయ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, పంటలను పరిశీలించారు. రైతులు ఆందోళన చెందొద్దని, తడసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. అనంతరం వివిధ గ్రామాలలో పలువురిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, జెడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరు సతీష్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గొల్ల వెంకటేష్, పట్టణ అధ్యక్షులు వాజిద్‌ఖాన్, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు పడగల భూషణ్, తాళ్లపెల్లి రమేష్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు శిక్షణలు ఉపయోగపడతాయి : కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాల గురించి శిక్షణల ద్వారా తెలియజేయడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్ వసతి గృహ సంక్షేమ అధికారులకు, నాల్గవ తరగతి ఉద్యోగులకు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి కలెక్టర్ హాజరై సంక్షేమ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహాల్లో పిల్లలు వారి తల్లిదండ్రులను వదిలి ఉంటారని, వారిని వసతిగృహాల సంక్షేమ అధికారులు సొంత బిడ్డల్లా చూసుకోవాలన్నారు. వారికి నాణ్యమైన భోజనంతో పాటు బోధన అందేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటు వైద్య సేవలు అందించాలన్నారు. సదస్సులు, శిక్షణాల ద్వారా ప్రభుత్వాలు లక్ష్యాలు తెలుసుకొని వాటిని అమలు చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు రాజలింగు, సునీత, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ ప్రారంభం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో శుక్రవారం వ్యవసాయధికారి ప్రవీణ్‌కుమార్ 60 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాల పంపిణీ ప్రారంభించారు. జీలుగ వేయడం వల్ల పంట చేలలో నేల గుల్లబారి అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ తెలిపారు. జీలుగ సాగుతో చౌడు పొలాలలో మంచి ఫలితాలు సాధ్యమన్నారు. అర్హులైన రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని వచ్చి 2.5 ఎకరాలకు సరిపడా జీలుగ సంచి తీసుకెళ్లాలని సూచించారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేరాలి

నవతెలంగాణ-భైంసా

విద్యార్థులు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేరాలని ఎస్ఎస్‌యుఐ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు అంజద్ షేక్ అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో చేరి విద్యార్థులు బంగారు భవితకు బాటలు వేసుకోవాలని కోరారు. భైంసా, కుభీర్, ముధోల్, తానూర్, కుంటాల, లోకేశ్వరం మండలాల్లోని ప్రభుత్వ జూనియర్, భైంసాలో ఉన్న డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలన్నారు. అనుభవిజ్ఞులతో విద్యా బోధన పొంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పేర్కొన్నారు.

కడెం ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టు గేట్లకు మరమ్మత్తులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రాజెక్టును ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గేట్లకు మరమ్మత్తులను వర్షాకాలానికి మునుపే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా స్వయం సహాయక బృందాలతో సిద్ధం చేస్తున్న ఏకరూప దుస్తుల తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందే ఏకరూప దుస్తులను సిద్ధం చేయాలని తెలిపారు. ఆ తర్వాత మండలంలోని లింగాపూర్ గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని త్వరగా అమ్మేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.

రైతుల నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే దానికి సంబంధించిన ట్యాబ్ ఎంట్రీని కచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించేందుకు వీలుగా సరిపడినన్ని లారీలు, కూలీలను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులందరూ వరి ధాన్యాన్ని ప్యాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా శుభ్రపరిచే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు మాత్రమే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఆకాల వర్షాలు కురుస్తున్నందున రైతుల ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు వీలుగా సరిపడినన్ని టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. తదనంతరం మండలంలోని సారంగాపూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు.

జూన్ 5లోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో డీఈఓ రవీందర్‌రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, సివిల్ సప్లయిస్ డిఎం శ్రీకళ, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

- 120 మంది విద్యార్థులు గైర్హాజరు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు, వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ డిప్లమోలలో ప్రవేశాల కోసం శుక్రవారం జరిగిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు జరిగింది. నిమిషం నిబంధన ఉండడంతో విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 10 గంటల నుండే వారిని తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. విద్యార్థులు పరీక్ష ప్యాడ్, పెన్ను, పెన్సిల్ మినహా ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. మరో వైపు ఎండలను దృష్టిలో ఉంచుకొని ఆయా పరీక్షా కేంద్రాల్లో తాగునీటితో పాటు అత్యవసర వైద్యం అందించేలా ఎఎన్ఎంలను అందుబాటులో ఉంచారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను సిద్ధంగా ఉంచారు. ఉదయం పరీక్షా ప్రారంభం కాగానే ఆయా కేంద్రాలను పాలిసెట్ కన్వీనర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ సందర్శించి పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలో విద్యార్థి డిగ్రీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల, ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముగ్గురు అబ్జర్వర్ల ఆధ్వర్యంలో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి మొత్తం 1059 విద్యార్థులు ఉండగా బాలురు 531 మంది బాలికలు 408 మంది మొత్తం 939 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరైనట్లు సమన్వయకర్త భరద్వాజ తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు, ర్యాంకు ఆధారంగా వివిధ పాలిటెక్నిక్ కళాశాలలు, కోర్సులలో అడ్మిషన్స్ ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష ఫలితాలు త్వరలో విడుదల అవుతాయని పేర్కొన్నారు.

పోడు వ్యవహారంలో అధికారులను అడ్డుకున్న రైతులు



నవతెలంగాణ - కాగజ్‌నగర్

వానా కాలం పంటల సీజన్ రాగానే అటవీశాఖ అధికారులు పోడు భూముల స్వాధీనానికి ఉపక్రమించడం, తమకు పట్టాలు ఉన్నాయని రైతులు ఆందోళనకు దిగడం కాగజ్‌నగర్ అటవీ రేంజీ పరిధిలో ఏటా జరుగుతున్న వ్యవహారమే. పంటల సీజన్ రాగానే పోడు భూములను స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేసుకునేందుకు అటవీ అధికారులు, తమకు పట్టాలు ఉన్నాయని రైతులు అధికారులను అడ్డుకోవడం కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజీ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నెం.69, అంకుసాపూర్ శివారులో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఈ సంవత్సరం కూడా రెండు, మూడు రోజుల నుండి అధికారులు, రైతుల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకుల రంగ ప్రవేశంతో వివాదాస్పద పోడు భూముల్లో పంటల సాగుకు అనుమతించడం అనవాయితీగా మారింది. ఈ క్రమంలోనే శుక్రవారం కంపార్ట్మెంట్ నెం.69లోని పోడు భూములను స్వాధీనం చేసుకునేందుకు డిప్యూటీ రేంజ్ అధికారి శశిధర్‌రాజు ఆధ్వర్యంలో ఎఫ్‌బీఓ జానయ్య, నవ్య, సిబ్బంది వివాదాస్పద పోడు భూముల్లో హద్దుల ఏర్పాటు చేసుకునేందుకు వచ్చారు. పట్టాలు కలిగిన రైతులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టేదారు పాసుపుస్తకాలతో తరలివచ్చిన రైతులు అటవీ అధికారులను ముచ్చెమటలు పుట్టించారు. అటవీశాఖ, రెవెన్యూశాఖ సంయుక్తంగా సర్వే నిర్వహించినట్లయితే సమస్యకు పరిష్కారం లభించనుంది. దాదాపు రెండు గంటల పాటు రైతులు, అధికారులు నిరీక్షించి ఆ తర్వాత ఇంటిదారి పట్టారు.

ధరలకనుగుణంగా వేతన ఒప్పందం అమలు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

బీడీ కార్మికులందరికీ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం చేసి, అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టియు) రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కంపెనీ యజమానుల సంఘం అధ్యక్షుడు హెచ్‌పి.ప్రకాష్ ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్ గాంధీలకు డిమాండ్ నోటీసు ఇచ్చామన్నారు. 30 ఏప్రిల్ 2024 వరకు వేతన ఒప్పందం ముగిసిందని, వెంటనే వేతన ఒప్పందం చేసి 1 మే 2024 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేయి బీడీలకు రూ.400 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలో పని చేసే అన్ని రకాల కార్మికులకు ప్రస్తుత వేతనంపై 50 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కరువు భత్యం రేటు పాయింటుకు 10 పైసల నుండి 30 పైసలకు పెంచాలని కోరారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు అనేక సమస్యలు ఉన్నాయని, వాటన్నింటినీ సామరస్యంగా చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | మే 25, 2024 | www.navatelangana.com

విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని వ్యవసాయ విత్తన, ఎరువుల దుకాణలలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు ఏఓ ప్రవీణ్ కుమార్, ఎస్సై శ్రీకాంత్ తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, స్టాక్ నిల్వలను పరిశీలించారు. ప్రతీ కొనుగోలుదారుడికి కొనుగోలు రశీదును తప్పకుండా ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే అందించాలని ఆదేశించారు. అనుమతిలేని విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు తనిఖీ

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని రాజుర గ్రామాన్ని శుక్రవారం ఎంపీడీఓ సోలమన్ రాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులతో పాటు నర్సరీ, కార్యాలయంలోని పలు రకాల రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో అవకతవకలు జరగకుండా నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇందులో ఆయనతో పాటు సూపరింటెండెంట్ వెంకట్, రమేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్, సిబ్బంది ఉన్నారు.

విధులు లేవు.. నిధులు నిల్..

- ఐదేండ్ల పదవీ కాలంపై తీవ్ర నిరుత్సాహం
- పేరుకే పరిమితమైన ఎంపీటీసీ, జెడ్పీటీసీలు
- పదవులు నామమాత్రంగా మారాయని ఆవేదన

నవతెలంగాణ-సిరికొండ

ఎన్నికల్లో లక్షలు ఖర్చు చేసి, ఐదేండ్లు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకే నిధులు లేవు. పేరుకే ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు కానీ విధులు లేవు.. నిధుల్లేవ్.. అంతకన్నా ముఖ్యం ప్రాధాన్యతా లేదు. ప్రజాప్రతినిధులు అన్నమాట తప్ప ఎందుకు పనికి రాకుండా ఉత్సవ విగ్రహాలుగా మిగులుతున్నామని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేండ్ల కాలంలో ఇది ఎంపీటీసీలు, జెడ్పీటీసీల గోడు..

ఆవేదనలో ఎంపీటీసీలు

ఎంపీటీసీ సభ్యులకు గత పదేండ్లలో వారికి వచ్చింది. కేవలం రూ.2లక్షల లోపు మాత్రమే. వీటితో గ్రామాల్లో ఏమీ అభివృద్ధి చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. సిరికొండ మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలు ఉండగా వారిలో ఎక్కువమంది ఆర్థికంగా వెనుకబడిన వారే ఉన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఎంపీటీసీలపై చిత్తశుద్ధి చూపించాలి. నిధులు మంజూరు చేయాలి.



పేరుకే ప్రజాప్రతినిధులు

పరిషత్ ఎన్నికలు జరిగి ఐదేండ్లు పూర్తికావస్తుంది. గతంలో జెడ్పీటీసీల ద్వారా గ్రామాలకు నిధులు అందేవి. కానీ 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు జెడ్పీటీసీల ద్వారా కాకుండా జీపీలకు చేరుతుండటంతో పరిషత్తుల పాత్ర ప్రాధాన్యం కోల్పోయింది. ప్రస్తుత విధానంలో ఆర్థిక సంఘం ద్వారా 80శాతం నిధులు గ్రామపంచాయతీలకు మండల పరిషత్‌లకు 15శాతం జిల్లా పరిషత్‌లకు ఐదు శాతం లెక్కన కేటాయింపులు జరిగాయి. ఈ లెక్కన ఒక్కో జెడ్పీటీసీకి ఏడాదికి ఐదు నుంచి పది లక్షలు రావాల్సి ఉంది. కానీ ఆ విధంగా నిధులు అందడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఎంపీటీసీ సభ్యులకు 15వ ఆర్థిక సంఘం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేశారు. అయినప్పటికీ వారికి ఆశించిన నిధులు రావడంలేదని అసంతృప్తితో రగులుతున్నారు.

గ్రామాల అభివృద్ధిలో ఎంపీటీసీలను భాగస్వామ్యం చేయాలి

సూర్యకాంత్ ఎంపీటీసీ సాంపల్లి



ఎంపీటీసీగా గెలిచి ఐదేండ్లు పూర్తి కావచ్చింది. కానీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిధులు లేవు. ఎంపీటీసీగా గెలిచినందుకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా.. ఎంపీటీసీ పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. పరిషత్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ఎంపీటీసీలను భాగస్వామ్యం చేయాలి.

ఎంపీటీసీలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలి

పర్వీన్ లతీఫ్ ఎంపీటీసీ సిరికొండ



ఎంపీటీసీలకు పంచాయతీ సర్పంచులతో పాటు సమానంగా నిధులు ఇవ్వాలి. తమకు ఇచ్చే అరకొర నిధులతో అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. ఎంపీటీసీలను నిర్వీర్యం చేసే విధంగా ఉంది. పంచాయతీ నిధులతో పాటు, ఎంపీటీసీ నిధులు కలిస్తే గ్రామాలు బాగుపడతాయి. తమ పదవీకాలం పూర్తయ్యాక పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వాలు ఆలోచించాలి.

ఉత్సవ విగ్రహాలమా..?

మారుతి వాయిపేట్ ఎంపీటీసీ



గత ప్రభుత్వం ఎంపీటీసీలను ఉత్సవ విగ్రహాలుగా చూసింది. కనీసం ప్రోటోకాల్ కూడా పాటించలేదు. నిధులు లేవ్.. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత లేదు. ఏ ప్రభుత్వం ఉన్నా ఎంపీటీసీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు సకాలంలో అందించాలి.

విద్యుత్ స్తంభం విరిగి పడి బాలికకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-సారంగాపూర్

విద్యుత్ స్థంభం విరిగి పడి బాలికకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌట్ల(బి) గ్రామానికి చెందిన రాథోడ్ గంగాధర్ తన ఇంటివద్ద ఉన్న చెట్టును కొట్టివేస్తున్న క్రమంలో చెట్టు విద్యుత్ తీగలపై పడింది. పక్కనే ఉన్న విద్యుత్ స్థంభం విరిగి అక్కడి ఆడుకుంటున్న చిన్నారి చైత్ర(3) కాలుపై పడింది. దీంతో పాపకు తీవ్రగాయాలయ్యాయి వెంటనే నిర్మల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చెట్టును కొట్టి తొలగించే సమయంలో విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వకుండా చెట్టును కొట్టేసిన రాథోడ్ గంగాధర్‌పై విద్యుత్‌శాఖ అధికారి సాయి కిరణ్ ఫిర్యాదు చేయగా సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

వరి ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి భుజంగ్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. వరి ధాన్యం కొనుగోళ్ల త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రాచపూర్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం రైస్ మిల్లులలో ధాన్యం నిల్వలు పరిశీలించారు. డీఆర్ఓ వెంట తహసీల్దార్ జానకి, ఆర్ఐ దేవిక, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-నేరడిగొండ

పంటల యాజమాన్య పద్ధతులపై ఏఈఓలు రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని గాజిలి, బుగ్గారం, బంధంరేగడి, కోరిటికల్(బి), వాగ్ధరి, వడూర్, యాపల్‌గూడ గ్రామాల్లో ఏఈఓలు ఖరీఫ్ సీజన్ సాగుపై సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓలు మాట్లాడారు. వానాకాలం సాగులో భూమి చదును చేయడం నుంచి పంటల కోతల వరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. సీజన్ ప్రారంభంలో ముఖ్యంగా విత్తనాల ఎంపిక, కొనుగోళ్ల గురించి వివరించారు. అధీకృత విత్తన దుకాణదారులు నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి, తప్పకుండా రశీదు తీసుకోవాలన్నారు. దానిలో విత్తన రకం, లాట్ నెంబర్, గడువు, ధర తదితర పూర్తి వివరాలు రశీదులో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. విత్తన రశీదు పంట కాలం పూర్తి అయ్యేవరకు దగ్గర భద్రంగా ఉంచాలని అన్నారు. తగినంత వర్షపాతం నమోదైన తరువాత విత్తనాలు విత్తుకోవాలని తెలిపారు. ఇంకా వ్యవసాయ సంబంధిత పూర్తి వివరాలకు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు జైపాల్, స్వర్ణలత, అపర్ణ, మహేందర్, సౌజన్య, గజేందర్, సంకీర్తన వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మహిళ సంఘానికి ఇచ్చిన ట్రాక్టర్ ఎక్కడా...?



నవతెలంగాణ-తాంసి

గతంలో ఐకేపీ మహిళ సంఘానికి ప్రభుత్వం అందించిన ట్రాక్టర్ ఎక్కడ ఉందని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు ఐకేపీ ఏపీఎం రవీందర్‌ను నిలదీశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ మంజులశ్రీధర్‌రెడ్డి అధ్యక్షత సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభమైంది. ముందుగా ఎజెండా అంశాలను చదివి వినిపించారు. అనంతరం వివిధ శాఖ వారిగా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ముందుగా ఏఓ రవీందర్ తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మండలంలో 15వేల 500 సాగుభూమి ఉందన్నారు. రైతులకు అవసరమైన పత్తి విత్తనాల ప్యాకెట్లు 10 వేల 100 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేసి, లాట్ నెంబర్ బిల్లులు తీసుకోవాలని అన్నారు. భూసార పరీక్షలు చేయించాలని రైతులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ జూన్ 12వ తేది వరకు అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మత్తులకు రూ.54 లక్షలు మంజూరయ్యాయని అన్నారు. ఏపీఎం రవీందర్ మాట్లాడుతూ 15 గ్రామ సంఘాలు ఉన్నాయన్నారు. అన్ని సంఘాలకు కలుపుకొని రూ.11 కోట్ల మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కాగా సభ్యులు కలుగజేసుకొని గతంలో ఐకేపీ సంఘానికి ప్రభుత్వం అందించిన ట్రాక్టర్ ఎక్కడ ఉందని ప్రశ్నించగా ఏపీఎం పొంతనలేని సమాధానం చెప్పడంతో వెంటనే ఆ ట్రాక్టర్‌ను కార్యాలయానికి తీసుకురావాలని, జెడ్పీటీసీతో పాటు సభ్యులు కోరారు. మిషన్ భగీరథ ఏఈ ప్రశాంత్ మాట్లాడుతూ అన్ని గ్రామాలకు తాగునీటి సమస్య లేకుండా చూడటం జరిగిందన్నారు. పశు వైద్యాధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ గాలికుంటు పశువులకు సోకకుండా టీకాలు వేయడం జరిగిందని, వర్షాకాలంలో జబ్బువ్యాది రాకుండా టీకాలు వేయడం జరుగుతుందని అన్నారు. పోషకులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు. పంచాయతీరాజ్ ఏఈ గతంలో మన ఊరు మన బడి పాఠశాలలకు మంజూరైన పనులను కొనసాగుతున్నాయని అన్నారు. అటవీశాఖ అధికారి వివరిస్తూ గతంలో హరితహరంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను విద్యుత్ అధికారులు నరికి వేయడం జరుగుతుందని అన్నారు. విద్యుత్ లైన్ ఇన్స్‌పెక్టర్ నజీర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడం జరుగుతుందని, ఈదురుగాలులు కారణంగా చెట్లు విద్యుత్ వైర్లు పడిపోవడం కారణంగా విద్యుత్తులో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. పూర్తి స్థాయిలో సిబ్బంది లేని కారణంగా సకాలంలో పన్ను పూర్తి చేయలేకపోతున్నామని అన్నారు. జెడ్పీటీసీ రాజు మాట్లాడుతూ సర్పంచ్ పదవీకాలం ముగిసిందని, ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు గ్రామాలను సందర్శించి తాగునీరు, మురుగు కాలువలు, వీధి దీపాల సమస్య లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్ రెడ్డి, స్వప్న శీలా, సూపరింటెండెంట్ రవీందర్, ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ఉన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి సమస్య పరిష్కరించాలి



నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి గ్రామ సమీపంలోని పంట పొలాలకు వెళ్లే రహదారి సమీపంలోని రైల్వే 29వ అండర్ బ్రిడ్జి నిర్మాణంలో వర్షపు నీరు నిల్వతో పాటు ట్రెంచ్ పూడిక నిండి పోవడం కారణంగా రైతులు తమ పంట పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని గ్రామరైతులు పేర్కొన్నారు. ఇలా రైతులకు ఇబ్బందులు తలెత్తడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ మేనేజర్‌ను కలిసి తమ సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మేనేజర్ సానుకూలంగా స్పందించి, రైల్వే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇరవై రోజుల్లోగా రైతుల సమస్య పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్, గ్రామస్తులు రఘు, రమణ, లక్ష్మీపతి, నర్సింగ్, రైతులు ఉన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని మహాలక్ష్మివాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైనర్ రిపేర్స్, ఫ్లోరింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్‌ను, కాంపౌండ్ వాల్‌ను పరిశీలించి, చిన్న చిన్న మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి స్కూల్స్‌లో ఎల్ఈడీ బల్బులే వాడాలన్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే పూర్తి స్థాయిలో రిపేరు చేయించి, అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, డీఆర్డీఓ సాయన్న, ఎంఈఓ, తహసీల్దార్ తుకారాం, మెప్మా కమిటీ చైర్మెన్, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : అమ్మ ఆదర్శ పాఠశాల పనులను డీపీఓ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని అర్లి, గొడిసెర, వట్టొలి గ్రామాల్లోని అమ్మఆదర్శ పాఠశాల పనులను, నర్సరీ, శ్మశాన వాటిక, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. డీపీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, రాము, సిబ్బంది ఉన్నారు.

ఆదివాసుల సంస్కృతీ సాంప్రదాయాలు గొప్పవి



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు గొప్పవని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తగూడా గ్రామంలో 'భావె మహినా' సందర్భంగా ఆత్రం పరివార్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పెర్సపేన్‌లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసులు ప్రకృతిని దైవంగా భావించి, ఎంతో నియమ నిష్టలతో పూజలు చేసి తమ సంస్కృతి సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను యావత్ ప్రపంచానికి చాటి చెప్పడం జరుగుతుందని పేర్కొన్నారు. నేటి యువత సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోతున్నారన్నారు. తమ ముత్తాతల కాలం నుంచి ఆచరిస్తున్న సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఎంతైన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్రం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రానికి చెందిన సోలంకి సాయికిరణ్ బ్రెయిన్ సంబంధిత సమస్యతో హైదారాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ నిమ్స్‌కు వెళ్లి వైద్యులతో మాట్లాడి సాయి కిరణ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యాన్నిచ్చారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుంజాల ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణులకు బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచిత మందులు పంపిణీ చేశారు. గర్భిణులు రోజు ఐరన్, క్యాల్షియం టాబ్లెట్ వేసుకోవాలని నెల వారిగా పరీక్షలు చేయించుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ సూచించారు. వారి వెంట ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

విత్తనాలపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని వడగల్‌పూర్(కె) గ్రామంలో రైతులకు విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తనం విత్తుకునే ముందు తీసుకోవాల్సిన వ్యవసాయ పద్ధతులపై ఏఈఓ బి.మహేష్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ రాజు, రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | మే 25, 2024 | www.navatelangana.com

ఆస్పత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ప్రయివేటు ఆస్పత్రులను, డయాగ్నొస్టిక్ సెంటర్లను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారంబట్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అర్హత కలిగిన వైద్యులు మాత్రమే వైద్యం చేయాలని సూచించారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ చేస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీ సిఎన్డిటి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిద్ధార్థ, డీఏఎస్ డాక్టర్ సునీల్ రావు, డీపీయూ ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్లు సాయి, మణికాంత్ పాల్గొన్నారు.

ఆదర్శ ప్రవేశాలకు ఈ నెల 25 చివరి తేదీ

నవతెలంగాణ ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25న చివరి గడువని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసి, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో గ్రూపుకు 40 చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదవ తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం ఎంపిక ఉంటుందని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు టీఎస్‌మోడల్‌స్కూల్.కామ్ వెబ్సైట్ ద్వారా ఎటువంటి దరఖాస్తు రుసుము లేకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని, పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రారంభమైన ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు జిల్లాలో మొదటి రోజు ప్రశాంతంగా ముగిస్తాయి. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం పరీక్షలు నిర్వహించగా, మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ పలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ సంవత్సర విద్యార్థుల కోసం మొదటి రోజు 8 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో 648 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 606 మంది మాత్రమే పరీక్ష రాసినట్లు, 42 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర పరీక్షల్లో భాగంగా 8 సెంటర్లలో 178 మందిని కేటాయించగా, 172 మంది పరీక్షకు హాజరు కాగా, 6 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

నేడు ఆలయ భూములకు కౌలు వేలం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేశవ ఆలయం ఆధీనంలో ఉన్న భూములు ఒక సంవత్సరం కౌలు ఇవ్వడానికి శనివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వాడలో మినీ ఫంక్షన్ హాల్‌లో వేలం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈవో గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.50 వేలను ముందుగానే ధరావత్ సొమ్ముగా చెల్లించాలని పేర్కొన్నారు. వేలంపాట పూర్తయిన తర్వాత పూర్తి డబ్బు చెల్లించాల్సి ఉంటుందని ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాల కోసం 9618307962, 9885489088, 9908867600, 9491344496 నెంబర్ సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎంపీడీఓ ఉపాధి పనుల పరిశీలన



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని రాజుల గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ పంట చేల్లో గులకరాళ్ల కట్టలు ఉపాధి పనుల ద్వారా చేయడం వల్ల రైతుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. చేనులో గులకరాళ్లు లేకుండా చేస్తే రైతుకు ఎంతో సహాయకరంగా ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-కడెం

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ శుక్రవారం ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని మైసంపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైసంపేట గ్రామానికి చెందిన పంద్రం అమృత్‌రావు, అడ నాగోరావ్ ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై గురువారం గాదిగూడలోని జంగుబాయి దేవుని దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఉడుంపూర్ గ్రామ శివారులో అదుపు తప్పి ఓ చెట్టుకు ఢీకొట్టారు. ద్విచక్రవాహనం వెనకాల కూర్చున్న అమృత్‌రావుకు(55)తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

దొంగ బంగారం కేసు హాజీపూర్‌కు లింకు

నవతెలంగాణ - హాజీపూర్

దొంగ బంగారం కేసులో హాజీపూర్‌కు లింకు ఉన్నట్లు తెలుస్తోంది. గత వారం మండల కేంద్రంలోని ఓ స్వర్ణకారుడు దొంగ బంగారం కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసు విషయమై ఇప్పటికే హాజీపూర్‌కు చెందిన ఓ వ్యక్తి తో పాటు అతని స్నేహితులను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. 150 గ్రాముల దొంగ బంగారం కొనుగోలు విషయమై దొంగిలించిన వ్యక్తి సమాచారంతో పోలీసులు కూపీ లాగుతున్నట్లు సమాచారం. ఈ విషయమై మండలంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

లలిత సంగీతంలో డిప్లొమా



నవతెలంగాణ-జైనథ్

లలిత సంగీతంలో మండలంలోని కూర గ్రామానికి చెందిన గట్ల స్వామి ఉత్తీర్ణత సాధించారు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో లలిత సంగీతం అభ్యసించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శిక్షణ కేంద్రంలో ఆయనను డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, శిక్షణ ఇచ్చిన గురువు మల్లెల కబీర్‌దాసు అభినందించారు.

నకిలీ విత్తనాల నివారణకు సహకరించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- డీలర్లకు అవగాహన సదస్సు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నకిలీ విత్తనాల నివారణకు అధికారులకు డీలర్లు సహకరించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేష్ దోత్రే హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ సురేష్ కుమార్, ఏఎస్పీ ప్రభాకర్ రావు, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి కలిసి విత్తనాలు ఎరువుల డీలర్లకు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన, నకిలీ విత్తనాలు రైతులకు అమ్మకూడదన్నారు. నిషేధిత పురుగు మందులు అమ్మితే డీలర్లపై పీడీ ఆక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. దుకాణాలలో తప్పనిసరిగా ఎరువులకు సంబంధించిన వివరాలు తెలిసే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సీజన్ పూర్తయ్యే వరకు వ్యవసాయ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు అమ్మాలని, అమ్మిన ప్రతి బస్తాకు రసీదు ఇవ్వాలన్నారు. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన ఖాళీ సంచులు భద్రపరుచుకోవాలని ఒకవేళ పంట నష్టపోతే సంబంధిత కంపెనీల నుంచి నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. అదే సమయంలో వాటిని అమ్మిన దుకాణదారులపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖలు సమన్వయం చేసుకొని టాస్క్ ఫోర్స్ ద్వారా నకిలి విత్తనాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థులకు సీజనల్ పండ్లు అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గిరిజన విద్యార్థులకు సీజనల్ పండ్లు అందజేస్తున్నట్లు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ-ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు, వేసవి క్రీడా శిబిరాలలో విద్యార్థిని విద్యార్థులకు కార్బైడ్ వినియోగం లేకుండా సహజ సిద్ధంగా పండిన మామిడి పండ్లను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని ఉద్యాన నర్సరీల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. కార్బైడ్ రహిత మామిడి పండ్లు తినడం ద్వారా ఎలాంటి దుష్ఫలితాలు ఉండవని, ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివద్ధి సంస్థ పరిధిలోని ఉద్యాన నర్సరీలలో సహజ సిద్ధంగా పండించిన మామిడి పండ్లను ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్, కాగజ్‌నగర్‌లలో ఉన్న పోస్ట్ మెట్రిక్ గృహాలలోని విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా అందించడం జరుగుతుందని, ఉద్యాన అధికారి జి సందీప్ కుమార్, ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న ఎటీడీఓల సమన్వయంతో పండ్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఉట్నూర్, ఆసిఫాబాద్‌లలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాలలోని విద్యార్థిని విద్యార్థులకు కూడా మామిడి పండ్లు జిల్లా క్రీడా అధికారి పార్థసారధి పర్యవేక్షణలో సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. మొదటిసారి విద్యార్థులకు ఆరోగ్యకరమైన మామిడి పండ్లు అందించడంతో సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్, జిల్లా క్రీడాధికారి పార్థసారధి, హెచ్ఎన్‌టీసీ సిబ్బంది సుధీర్ కుమార్, అర్షిత, పూజ, సాయిరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్ష హాల్లో తల్లిదండ్రులు చెట్ల నీడలో



- జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వేసవి తాపం తీవ్రంగా ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి తమ పిల్లలను పరీక్ష రాయడానికి తీసుకువచ్చిన తల్లిదండ్రులు సెంటర్ల ఎదుట ఉన్న చెట్ల కింద సేద తీరుతూ కనిపించారు. జిల్లా కేంద్రాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గిరిజన గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలతో పాటు, ఆదర్శ డిగ్రీ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయమే సెంటర్ల దగ్గరికి చేరుకున్న విద్యార్థులు పరీక్ష రాయడానికి వెళ్లడంతో వారిని తీసుకువచ్చిన తల్లిదండ్రులు ఆయా సెంటర్ ఎదుట సేద తీరుతూ కనిపించారు.

జిల్లాలో 90.82 శాతం హాజరు

జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పాలీసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ముగియగా 90.82 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు పాలిసెట్ కన్వీనర్ కనకయ్య తెలిపారు. జిల్లాలో పాలీసెట్ పరీక్ష రాసే విద్యార్థుల కోసం నాలుగు సెంటర్లు కేటాయించగా వాటిలో 883 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా, 802 మంది పరీక్ష రాశారు. వీరిలో 451 విద్యార్థులు, 351 విద్యార్థినులు ఉన్నట్లు తెలిపారు. మొత్తం 81 మంది గైర్హాజరు కాగా, 90.82 శాతం విద్యార్థులు హాజరయ్యారు.





నల్లమల్ల గిరిప్రసాద్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- సీపీఐ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బలవంతమైన నాయకత్వం తయారు చేసిన మహనీయుడు నల్లమల్ల గిరిప్రసాద్ ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నల్లమల్ల గిరిప్రసాద్ 27వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ సీపీఐ సిద్దాంతలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మరింత బలోపేతం చేసిన మహనీయుడు గిరిప్రసాద్ అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా ఆయన కీలకంగా వ్యవహరించారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా విశాలాంధ్ర అధ్యక్షుడిగా రాజ్యసభ సభ్యుడిగా పని చేశారని గుర్తు చేశారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో పార్టీ నాయకులు అరుణ్ కుమార్, సాట్వాజీ, దేవిదాస్ పాల్గొన్నారు.



అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రెస్ క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మండలం చారిగాం శివార్లలో అక్రమ మట్టి తవ్వకాలపై మైనింగ్ ఏడీ గంగాధర్ రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లోని చారిగాం శివారులో అక్రమ మైనింగ్ స్థలంలో వార్త సేకరణకు వెళ్లిన జర్నలిస్ట్ తిరుపతిపై మైనింగ్ నిర్వాహకుడు ఖలీం, అతని అనుచరులు దాడి చేశారని, ఆ స్థలంలో మట్టి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా, లేకుంటే విచారణ జరిపి మైనింగ్ నిర్వాహకుడు ఖలీంపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. స్పందించిన మైనింగ్ ఏడీ గంగాధర్‌రావు మాట్లాడుతూ కాగజ్‌నగర్ ప్రాంతంలో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, పట్టా భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టిన ఖచ్చితంగా తమ శాఖ అనుమతులు ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ సురేష్, కోశాధికారి సురేష్, సభ్యులు మహేష్, ప్రకాష్ గౌడ్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాసవి ఆలయంలో చండీ హోమం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వాసవి ఆలయంలో వాసవి మాత ప్రతిష్ఠ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ దంపతులతో పాటు దాదాపు 20కి పైగా జంటలు భాగస్వాములయ్యాయి. సిద్ధిపేటకు చెందిన మునికొండ నాగరాజ్ శర్మ ఆధ్వర్యంలో హోమం అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సంక్షేమం కోసం హోమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి ఆలయ కమిటీ సభ్యులు ప్రమోద్, విజయ్, పాల్గొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కలిసిన గౌడ సంఘం సభ్యులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల గౌడ సంఘ సభ్యులు నిర్మల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎంఏ రజక్‌ను జిల్లా కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. సూపరింటెండెంట్‌తో పాటు సీఐ సింధును కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు వేణుగౌడ్, గంగాధర్‌గౌడ్, రమణగౌడ్, రాజాగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, సంఘ సభ్యులు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బైంసా మున్సిపల్ కమిషనర్‌గా సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-భైంసా

భైంసా మున్సిపల్ కమిషనర్‌గా సుదర్శన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కగా అధికారులు సస్పెండ్ చేశారు. దీంతో మున్సిపల్ డీఈగా పని చేస్తున్న సుదర్శన్‌రెడ్డికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల

అమృత్ భారత్ పథకంలో భాగంగా ఎంపిక అయిన మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేశ్ కుమార్ జైన్ సోమవారం రామగుండం రైల్వే స్టేషన్ పరిశిలన అనంతరం మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న వైటింగ్‌హాల్, రిజర్వేషన్ కౌంటర్‌లను, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ స్థలాన్ని మార్చాలని, వెల్కమ్ ఆర్చ్, చార్జింగ్ పాయింట్లను, ముందు భాగంలో గల ఎలివేషన్ డిజైన్‌ను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల స్టేషన్ మేనేజర్ రవీందర్, ఇన్స్‌పెక్టర్ సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
మంచిర్యాల
శనివారం | మే 25, 2024 | www.navatelangana.com

మరణించి..ఇద్దరికి కంటి చూపునిచ్చి..



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఆర్కే-8 కాలనికి చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి మరణించి కూడా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించి మరణంలోనూ మహోపకారం చేశారు. వివరాల్లోకి వెళితే ఆర్కే8 కాలనీ ఎస్టీ137 క్వార్టర్లో నివసించే సింగరేణి మాజీ ఉద్యోగి, పోతునూరి సత్యనారాయణ(80) శుక్రవారం మరణించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చౌడవరపు లింగమూర్తి ద్వారా కుమారుడు శ్రీనివాస్, కోడలు స్నేహలత, కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, గౌరవ సలహాదారు నూకా రమేష్, అధ్యక్షులు శ్రవణ్ కుమార్ వారిని అభినందనందించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలను పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-లక్సెట్టిపేట



లక్సెట్టిపేట మండలంలోని జెండవెంకటాపూర్, బలరావుపేట్ గ్రామ పంచాయతీలోని కుట్టు మిషన్ కేంద్రాలను, అమ్మ ఆదర్శ పాఠశాలను శుక్రవారం ఎంపీడీఓ కె సరోజ పరిశీలించారు. పలు కేంద్రాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఇట్టి పనులను పాఠశాలలు ప్రారంభించే నాటికి పూర్తి స్థాయిలో చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పెంచిన పెన్షన్ కోసం ఎదురుచూపు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికులు, ఉద్యోగులకు కనీస రూ.1000 పెన్షన్ పెంపు కోసం గత రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం1998లో పొందుపర్చిన నిబంధనల ప్రకారం 26 సంవత్సరాల క్రితం కనీస పెన్షన్ రూ.350లుగా నిర్ణయించారు. కార్మిక సంఘాలు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘాల పోరాట ఫలితంగా కనీస పెన్షన్ స్కీం సవరణ చేసి కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. బొగ్గు విశ్రాంత కార్మికుల కనీస పెన్షన్ రూ.350లకు బదులుగా రూ.1000గా నిర్ణయిస్తూ జీఎస్ఆర్ 165(ఇ) 2024 మార్చి 08న ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలో విశ్రాంత కార్మికులకు, వితంతువులకు ఇక నుండి కనీస పెన్షన్ రూ.1000 గుర్తించాలని కోరుతూ వివిధ ప్రాంతీయ సీఎంపీఎఫ్ కమీషనర్లను కోడ్ చేస్తూ 2024 మార్చి12న కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కమీషనర్ వీకే మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి అనుగుణంగా సింగరేణి జీఎం పర్సనల్ కూడా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సింగరేణి విశ్రాంత కార్మికులకు కూడా రూ.1000 పెన్షన్ అమలు పర్చేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెయ్యి రూపాయల లోపు పెన్షన్ పొందుతున్న వారు సింగరేణి వ్యాప్తంగా 19,128 మంది ఉండగా ఇలా రూ.15 వేలకు పైన తీసుకునే వారు మొత్తం 84,808 మంది ఉన్నారు.

ఓసీపీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-నస్పూర్

ఓసీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని ఆ సంఘం శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ రావు అన్నారు. శుక్రవారం బ్రాంచ్ నాయకులతో కలిసి ఎస్ఆర్పీ ఓసీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఓసీపీలో పనిచేస్తున్న ఉద్యోగుల, కాంటాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, ఐఎన్టీయూసీ ఎప్పుడు కార్మికుల పక్షాన ఉంటుందని అన్నారు. ఓసీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులపైన కాంట్రాక్టర్లు పని ఒత్తిడి చేస్తూ వారిని ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని, కాంట్రాక్టర్లు తమ విధానాన్ని మార్చుకోవాలని లేనిపక్షంలో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కాంట్రాక్టర్‌లు కాంటాక్ట్ కార్మిక వ్యతిరేక విధానాలపైన కాంగ్రెస్ మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్మికులకు మెరుగైన క్యాంటీన్ సౌకర్యాలు, రెస్ట్ హాల్ ఏర్పాటు ఏర్పాటు చేయాలని, ఓసీపీలో దుమ్ము రాకుండా ఎప్పటికప్పుడు వాటర్ స్ప్రే చేపించాలని, క్వారీలోకి వెళ్లే కార్మికులకు వెహికల్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, మైనింగ్ స్టాఫ్ కేంద్ర నాయకులు తిరుపతి రాజు, ఏరియా కార్యదర్శులు శీలం చిన్నయ్య, కాల్వ శ్రీనివాస్, తొకల వెంకటస్వామి, చంద్రమోహన్, ఎం సుధాకర్, మారుతి, ఓసీపీ ఫిట్ సెక్రెటరీ బలుముల జాన్సన్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ జగన్ పాల్గొన్నారు.



ఓసీని సందర్శించిన ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ రావు

ఓపెన్‌కాస్ట్ గని కార్మికల సమస్యలు పరిష్కరించండి

- ఏఐటీయూసీ ఎస్సార్పీ ఏరియా కార్యదర్శి బాజీసైదా



నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఓపెన్‌కాస్ట్ గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల యాజమాన్యం తక్షణమే స్పందించాలని శ్రీరాంపూర్ ఏరియా ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ, ఓసీ కార్మికులతో కలిసి గని మేనేజర్‌ను కలిసి వినతీ పత్రం అందజేసిన ఆయన ఓసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఓసీ మేజేర్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. గత రెండు నెలలుగా కన్వీనెన్స్ వేహికిల్ అందుబాటులో లేకపోవడం కార్మికులకు ఇబ్బందిగా మారిందని అన్నారు. కార్మికుల సౌకర్యార్థం వెంటనే కన్వీనెస్ వాహణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సర్వేడ్ ఆఫ్ ఎక్స్‌ప్లోజీవ్ వెకిల్ ఉండటం వలన ఇక్కడ వెహికిల్ అందుబాటులో ఉండక పోవటం, అదేవిధంగా ఎంవీ డ్రైవర్స్, ఓవర్‌మెన్స్ ఈపీ, ఎలక్ట్రిషియన్స్, జనరల్ మజ్దూర్ల కొరతను గుర్తించాలని అన్నారు. వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈపీ ఆపరేటర్స్, సర్వేయర్స్ రూంలో మధ్యన గత స్విచ్ స్టేషన్ వెంటనే మర్చాలని డిమాండ్ చేశారు. ఈపీ ఆపరేటర్స్ కొరతపై దృష్టి సారించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం గతంలో కూడా కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.


తిమ్మాపూర్‌లో ముగిసిన కేంద్రం బృందం పర్యటన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో కేంద్ర బృందం పర్యటన ముగిసింది. ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకు కేంద్ర బృందం ఐదు రోజులపాటు గ్రామంల్లో పర్యటించింది. గ్రామంలో విద్యా వైద్యం, మంచినీరు విద్యుత్తు, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతివనం, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, రైతు వేదిక నిర్వహణ, ఇలా గ్రామంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలపై అధ్యాయనం చేశారు. ఈ పర్యటనలో బృందం దృష్టికి వచ్చిన వివరాలను మంచిర్యాల కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. ఆ కేంద్ర బృందం సభ్యులను శుక్రవారం మండల అధికారులు, గ్రామ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఏపీఓ రవీందర్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు చిందం చంద్రయ్య సీఏ లలిత, కంప్యూటర్ ఆపరేటర్ శివాజీ విలాస్, శ్రీనివాస్ భూమయ్య ఉన్నారు.

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



నవతెలంగాణ-మందమర్రి

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. పరీక్షలు రాసేందుకు జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 4340, రెండో సంవత్సరం 2982 మంది విద్యార్థులు ఫీజు చెల్లించినట్లు డీఐఈఓ ఆర్ శైలజ తెలిపారు. రోజూ రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం జరిగిన మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 98మంది విద్యార్థులకు గాను 4గురు గైర్హాజరు కాగా 94మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు సెట్ బి పరీక్షా పత్రాన్ని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్ ఎం కృష్ణయ్య తెలిపారు.

జన్నారం : ఇంటర్మీడియట్ సప్లమెంటరీ మొదటి ద్వితీయ సంవత్సరం పరీక్షలు శుక్రవారం మొదలయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలలో మొత్తం 116 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా నలుగురు గైర్హాజరు కాగా ద్వితీయ సంవత్సరం పరీక్షలలో 57 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరు కాగా 55 మంది పరీక్షలు రాసినట్లు మండల విద్యాధికారి విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ మొదటి, ద్వితీయ, సంవత్సరం సప్లమెంటరీ పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీ పాల్పడకుండా పోలీసులచే కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించిన అధికారులు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో, మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, ఆ కాలనీ మహిళలు, బుధవారం ఉదయం ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. "మంచినీటి కోసం రోడ్డెక్కిన మహిళలు" అనే శీర్షిక నవతెలంగాణ పత్రికలోలో, గురువారం ప్రచురితం కావడంతో, స్పందించిన, పంచాయతీ కార్యదర్శి మేకల, లావణ్య, జేఈ అబ్రహంలు మిషన్ భగీరథ అధికారులు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని, గురువారం ఉదయం నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు, ఆ కాలనీలో పైపులను పనులు చేసి, అక్కడ ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా, నీటిని అందించారు, అలాగే గ్రామంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న బోర్వెల్‌ని రిపేర్ చేసి ఆ కాలనీ వాసులకు మీరు అందించారు. దీంతో ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు, అంబేద్కర్‌నగర్‌కు చెందిన కాలనీవాసులు, కార్యదర్శి మేకల లావణ్య జేఈ అబ్రహంలకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వీస్ రోడ్లపై వాహనాలను నిలపరాదు

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



నవతెలంగాణ-తాండూర్

సర్వీస్ రోడ్లపై వాహనాలను నిలిపి ఉంచడం వల్ల రవాణాకు ఆటంకం ఏర్పడుతుందని సర్వీస్ రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయరాదని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. శుక్రవారం తాండూర్ సర్కిల్ పరిధిలోని తాండూర్ ఐబీ కేంద్రంలో వాహనదారులకు వ్యాపారస్తులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సర్వీస్ రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేసి రవాణ సౌకర్యాలకు ఆటంకం కల్పించినట్లయితే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపారస్తులు తమ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు సీఐ కుమారస్వామి, ఎస్సై లక్ష్మణ్ పాల్గొన్నారు.

చెరువు భూమి అక్రమ పట్టాలు రద్దు చేయాలి

నవతెలంగాణ-జన్నారం



కిష్టాపూర్‌పూర చెరువుభూమిలో చేసిన అక్రమ పట్టాలను రద్దు చేయాలని, మత్యకారులు శుక్రవారం తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ దేవునిగూడ గ్రామపంచాయతి పరిదిలోగల చెర్లపల్లి గ్రామంలోని మత్స్య కార్మికులకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం (రి.నెం. ఎస్-02/1974) ఆదీనంలో గల కిష్టాపూర్ శివారులోనిఊర చెరువులో చేపల పెంచుకుంటు అమ్ముతూ దాదాపు 80 కుంటుంబాలు 46 సంవత్సరాలుగా జీవనోపాది పొందతున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో చెరువు భూమిలో కొంత భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా పట్టాలు చేసుకుంటు చెరువు భూమిని వ్యవసాయ భూమిగా మారుస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. దానితో చెరువు విస్తీర్ణం(శిఖం) తగ్గి మేము జీవనోపాది కోల్పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొంచెం సహకార సంఘం నాయకులు నాగయ్య, సత్తయ్య, శ్రీనివాస్ భీమరాజు నాగేష్, తిరుపతి శంకరయ్య పాల్గొన్నారు.

కార్మికులకు అన్ని రకాల వైద్య సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-తాండూరు

బెల్లంపల్లి సింగరేణి ఆస్పత్రిలో కార్మికులకు అన్ని రకాల వైద్య సేవలు అందే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు కోరారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం వెంటనే సింగరేణి బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. అన్ని రకాల వైద్య సేవలు అందించే విధంగా డాక్టర్లను నియమించాలని, అన్ని రకాల వైద్య పరికరాలను సమకూర్చాలన్నారు. వార్డ్ బాయ్స్, మెడికల్ సిబ్బందిని, నియమించాలన్నారు. బెల్లంపల్లి ఆస్పత్రికి పూర్వ వైభవం వచ్చేలా సింగరేణి యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు సిద్ధంశెట్టి రాజమౌళి, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు మల్లారపు చిన్నరాజు, రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, జిల్లా జనరల్ సెక్రెటరీ గెల్లి జయరాం పాల్గొన్నారు.

పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట సాగు మేలు

- విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి
- మండల వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్

నవతెలంగాణ-జైపూర్



పంటల సాగులో నాణ్యమైన దిగుబడి సాధించడం కోసం ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట సాగు చేయడం మేలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ తెలిపారు. శుక్రవారం నవతెలంగాణతో మాట్లాడుతూ ఖరీఫ్ పంటల సాగు సమీపిస్తున్నందున ఉమ్మడి మండలంలో రైతుల సౌకర్యార్థం సబ్సీడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. పంట పొలాల్లో పచ్చిరొట్ట సాగు చేయడం ద్వార భూమిలో సేంద్రియ కర్బనము, నత్రజని అందుతుంది. ఫలితంగా రసాయన ఎరువల వాడకం తగ్గించి భూములు సారవంతం చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సీడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడం కోసం రైతులకు అందుబాటులో నిల్వ చేసివుంచడం జరిగిందని తెలిపారు. జీలుగ విత్తనాలు 30 కిలోల బ్యాగుకు సబ్సీడీ పోను రైతులు రూ.1,116 చెల్లించి పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. వేసవి దుక్కుల తర్వాత జీలుగ విత్తనాలు వేసి పూతకు రావడానికి ముందు పొలంలో కలియదున్నడం ద్వార నేలకు మంచి పాటుగా ఉంటుందని తెలిపారు. ప్రధాన పంటలు సాగు చేస్తున్న సమయంలో రైతులు విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. అదేవిధంగా లోకల్‌గా ఎవరైనా విత్తనాలు అమ్మితే వాటిని కొని మోసపోవద్దని, అదేవిధంగా పక్క జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్న నకిలి విత్తనాల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించి రశీదు విధిగా తీసుకోవాలన్నారు. సదరు రశీదును పంట కాలం అయిపోయేంత వరకు ఇంటిలో బద్రపర్చుకోవల్సిన అవసరాన్ని రైతులు గుర్తుంచుకోవాలని తెలిపారు. అందుబాటలో గల ఆధీకృత (లైసెన్స్) విత్తన డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని విత్తన ప్యాకెట్ మీద విత్తనం తయారు చేసిన తేది, ఎక్స్‌పైరీ తేది ఉందా లేదా సరి చూసుకోవాలని, ప్రతి విత్తన ప్యాకెట్ మీద జీఈపీసీ నెంబర్ ఉందా.. లేదా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. పంటల సాగు ఆశించిన దిగుబడి సాధించడం కోసం విత్తనాల ఎంపిక ప్రధానమని ఆయన తెలిపారు.

భీమన్న దేవుడి పూజలు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తాటిగూడ ఆదివాసీ గిరిజన గ్రామస్తులు భీమన్న దేవుడి పూజలు చేశారు. ఆదివాసీల ఆరాధ్య దేవుడు భీమన్న దేవుడు, కుల దేవతల ప్రతిమలను తీసుకొని కాలినడకన డోలు వాయిద్యాలతో నడుచుకుంటూ వెళ్లి సల్పాలవాగు వద్దకు తరలివెళ్లారు. సల్పాలవాగులో దేవుళ్ల ప్రతిమలను గంగాజలాలతో శుద్ధి చేసి వారు కూడా స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేసి గ్రామానికి భయలుదేరి వెళ్లారు. అనంతరం ఇళ్లలో తమ దేవుళ్లను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ మడావి శేఖర్, పూజారి మడావి వెంకటేశ్, మడావి రాజు, మడావి గోపాల్, వెలాది అర్జు, సిడం కమలాకర్, సిడం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ కాలనీకి చెందిన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బ్లూ కోల్ట్ సిబ్బంది అతన్ని కాపాడారు. గురువారం రాత్రి శ్రీరాంపూర్ కాలని అర్కాకర్ నగర్కు చెందిన బల్ల మల్లయ్య అనే వ్యక్తి మద్యం సేవించి తన భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకునేందుకు మంచిర్యాల రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. అనంతరం తన భార్యకు ఫోన్ చేసి రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. వెంటనే అతని భార్య 100కు డయల్ చేయగా బ్లూ కోల్ట్ సిబ్బంది శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్‌కు తెలియజేశారు. ఎస్సై అతని మొబైల్ ద్వారా లొకేషన్ ట్రేస్ చేసి అతని సురక్షితంగా భార్యా పిల్లలకు అప్పగించారు. అనంతరం భార్యాభర్తలుకు ఇలాంటి ఘటనలు పునరావృతం కాండా శ్రీరాంపూర్ ఎస్సై కౌన్సిలింగ్ ఇచ్చారు. అతని కాపాడిన వారిలో హెడ్ కానిస్టేబుల్ గోవింద్ సింగ్, హోంగార్డు హనుమాడ్లు ఉన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-మందమర్రి



మందమర్రి పట్టణ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన గాండ్ల సంజీవ్‌ను శుక్రవారం ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్, ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్, మందమర్రి పట్టణ అధ్యక్షుడు నదిపట రాజు కుమార్, మండల అధ్యక్షుడు సకినాల శంకర్, సునాక్కర్ రాంబాబు, జావిద్ ఖాన్, సుందర్, సుజీత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | మే 25, 2024 | www.navatelangana.com

క్రీడల్లో గెలుపోటములు సహజం

నవతెలంగాణ-జన్నారం



క్రీడలలో గెలుపు ఓటములు సహజమని జన్నారం ఎస్సై రాజ వర్ధన్ అన్నారు. మండలంలోని కవ్వాల వాసి స్వర్గీయ అంజత్ ఖాన్ స్మారక క్రికెట్ పోటీల నిర్వహించగా అందులో గెలుపొందిన విజేతలకు ఆయన షీల్డ్‌లను అందించారు. ఈ సందర్భంగా పోటీలో గెలుపొందిన కవ్వాల జట్టుకు మొదటి బహుమతి గెలుపొందగా, కిష్టాపూర్ జట్టు రెండో బహుమతి గెలుపొందారు. మొదటి బహుమతి గెలుచుకున్న జట్టుకు రూ.10,116 రెండవ బహుమతి గెలుచుకున్న జట్టుకు రూ.5,116 నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు అక్రమ్ ఖాన్, మహేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం రాజశేఖర్, ఇసాక్, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, సక్కునాయక్, షాకిర్, మల్లేష్ పాల్గొన్నారు.

రైతు నేస్తాలు కృషి విజ్ఞాన కేంద్రాలు

నవతెలంగాణ-తాండూర్



కృషి విజ్ఞాన కేంద్రాలు రైతు నేస్తాలుగా వారి ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తున్నాయని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకల ముగింపు సమావేశంలో వారు మాట్లాడారు. విత్తనోత్పత్తి, క్షేత్ర పరిశీలనలు, క్షేత్ర ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాల ద్వారా రైతులు ఆర్థిక సావలంభన సాధించే విధంగా కృషి చేస్తున్నట్టు వివరించారు. వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు ఆధునిక వ్యవసాయ సాంకేతికతపైన అవగాహన పెంపొందించడమే కృషి విజ్ఞాన కేంద్రాల లక్ష్యమని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా రైతులకు మేలైన కంది విత్తనాలను అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.ప్రియసుగంధి, డా తిరుపతి, నాగరాజు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో నకిలీ పత్తి విత్తనాల గుట్టురట్టు

- పోలీసులు, అధికారులు ఏకకాలంలో దాడి
- రూ.19 లక్షలకు పైగా విలువచేసే ప్యాకెట్లు సీజ్
- గోదాం నిర్వాహకుడు సామ అశోక్‌రెడ్డి రిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రాంనగర్ పరిధిలో కోజకాలనీకి వెళ్లే మార్గంలోని ఓ గోదాంలో అనుమతి లేకుండా పత్తి విత్తనాలను ప్యాకెట్లుగా తయారుచేస్తున్న గుట్టును శుక్రవారం పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు ఏకకాలంలో దాడులు చేసి రట్టు చేశారు. గోదాంలో నిలువ ఉన్న దాదాపు రూ.19 లక్షల 39వేల విలువ చేసే అనుమతిలేని విత్తనాలను వారు స్వాధీనం చేసుకున్నారు. మీనాక్షి సీడ్స్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్ పత్తివిత్తన కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్న అశోక్‌రెడ్డి అనే వ్యక్తి కొద్ది రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం కొనసాగిస్తున్నట్టు వారి విచారణలో తేలింది. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో గోదామును తనిఖీ చేయగా విస్తురపోయే నిజాలు బయట పడ్డాయి. సదరు ఉద్యోగి మీనాక్షి అగ్రి సీడ్స్ కంపెనీ పేరుతోనే అనుమతులు లేకుండా పత్తి విత్తన ప్యాకెట్లు తయారు చేస్తు మార్కెట్లో సరఫరా చేస్తున్నాడు. మీనాక్షి గోల్డ్, పాండురంగ్ రకాలతో పాటు పుడమి అగ్రిసీడ్స్ పేరుతో పుడమి వైట్కింగ్, జె-16 పేర్లతో విత్తన ప్యాకెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వీటితో పాటు రూ.2లక్షల విలువ చేసే 370 ప్యాకెట్ల జొన్న విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మావల పోలీస్ స్టేషన్ పోలీసులు నిందితుడు అశోక్ పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో రూరల్ సీఐ ఫణీందర్, మావల ఎస్సై విష్ణు వర్ధన్, వ్యవసాయశాఖ అధికారులు శివకుమార్, రమేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు..

ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య మాట్లాడుతూ రాంనగర్‌లో ప్రధాన రహదారికి వెనుకగా ఉన్న గోదాములో నకిలీ విత్తన ప్యాకెట్లు తయారుచేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసు అధికారులతో కలిసిదాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో దాదాపు రూ.19 లక్షల 39 వేల 908 విలువ గల పత్తి, జొన్న విత్తనాలను సీజ్ చేశామన్నారు. గోదాం నిర్వహకుడు సామ అశోక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారని, నిందితుడితో పాటు అనుమతి లేకుండా ప్యాకింగ్ చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టడానికి ఇప్పటికే మండల కేంద్రాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేవడుతున్నామని తెలియజేశారు. నకిలీ విత్తనాలు విక్రయించే ఎంతటివారైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఇచ్చోడ : నకిలీ బీటీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ ఉదయ్ కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాబ్జిపేట గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన డీలర్‌షాప్ వద్దనే కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు చేస్తున్న సమయంలో విత్తన బ్యాగ్‌పై ఉన్న కంపెనీ పేరు, లాట్ నెంబర్, మానిఫ్యాక్చరింగ్, ఎక్స్‌పైరీ తేదీలు, రశీద్‌పై నమోదు చేశాడా లేదా అని పరిశీలించాలి. తీసుకున్న రసీదును తప్పకుండా భద్రపరుచుకోవాలన్నారు. గ్రామంలో నకిలీ బీటీ విత్తనాలు అమ్ముతున్నట్టు అనుమానం కలిగిన వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం పంటల మార్పిడితోనే అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. లోతు దుక్కి ద్వార ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. తొందర పడి విత్తనాలు విత్తుకోవద్దని అనుకూలమైన వర్షాలు కురిసిన తరువాతే పంట పొలాలలో విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు దేవురావు, రమేష్, మోహన్, తుల్సిరామ్ పాల్గొన్నారు.

సిరికొండ : రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఇన్‌చార్జీ మండల వ్యవసాయ అధికారి కైలాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విత్తనాల డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మండలంలోని విత్తనాల దుకాణాలను మండల తహసీల్దార్ విజయ్ కుమార్, ఎస్సై నవీన్‌లతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని అన్నారు. లైసెన్స్‌లను కలిగి ఉండాలని అన్నారు. రైతులకు విత్తనాలను విక్రయించే సమయంలో బిల్లులను తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. దుకాణాల్లో పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, దీపక్ పాల్గొన్నారు.

నార్నూర్ : ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన విత్తనాలను రైతులు వాడాలని, ఎరువుల డీలర్లు ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలనీ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఏఓ దివ్య, తహసీల్దార్ విజయనందం సూచించారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు ఇచ్చి మోసగిస్తే విత్తన, ఎరువుల దుకాణ యజమానిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా రైతువేదికలో రైతులు వాడాల్సిన వివిధ విత్తనాలపై అవగాహన కల్పించారు. విత్తనాలు ఎరువులు మందులు తీసుకునేటప్పుడు రైతులు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులకు, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అవగాహన కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఏఈఓలు రైతులు ఉన్నారు.

ఖానాపూర్ : నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై లింబాద్రి , ఏఓ ఆసం రవి అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని వివిధ ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుగుతూ విత్తన, ఎరువుల దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు.

ఆదిలాబాద్‌రూరల్ : మండలంలోని అంకోలిలో శుక్రవారం రైతు వేదికలో విత్తన డీలర్లకు, రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడారు. రైతులు విత్తనాలను ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్లకు రశీదును తీసుకోవాలని అన్నారు. రశీదులో లాట్‌నెంబర్, గడువు తేదిని చూసుకోవాలని అన్నారు. ఎవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి వ్యవసాయాధికారులను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్, ఏఓ అశ్రాఫ్, ఏఎస్సై సునిత, ఏఈఓలు, రైతులు, డీలర్లలు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి 20 మందికి అస్వస్థత



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలం లోకారి(బి) గ్రామంలో శుక్రవారం కలుషిత నీరు తాగి 20 మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్తులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి రిమ్స్‌కు తరలించారు. ఇందులో 108 సిబ్బంది పైలెట్లు వసీం, ముజఫర్, లచ్చు, రమేష్, ఈఎంటీ దీపక్, కిషన్, కృష్ణ, రవి ఉన్నారు.

నిల్వ ఉన్న ధాన్యంపై అధికారుల నిర్లక్ష్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని రైస్ మిల్లులో నిలువ ఉన్న ధాన్యంపై జిల్లా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మిల్లుల యజమానులు వడ్లను మిల్లింగ్ చేసి వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా, గడువు ముగిసిన ఇంకా రూ.44 కోట్లకు పైగా ధాన్యం వ్యాపారుల వద్ద ఉండటం దీనిని పౌరసరఫరాల సంస్థ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు. రైస్ మిల్లుల యజమానులు మిల్లులకు పంపిణీ చేసిన వరి ధాన్యాన్ని కష్టం మిల్లింగ్ రైస్ చేసి వచ్చే బియ్యాన్ని తిరిగి అప్పగించాల్సి ఉందన్నారు. 10 నెలల కిందట జిల్లా కేంద్రంలోని తొమ్మిది మిల్లులకు మంచిర్యాల ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 60 వేల టన్నుల ధాన్యాన్ని మూడు నెలల్లోనే మిల్లుల యజమానులు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి బియ్యాన్ని అందజేయాల్సి ఉందని తెలిపారు. కానీ ఇప్పటివరకు అందజేయకుండా ఉన్నప్పటికీ జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి నష్టం చేకూర్చే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పౌరసరఫరాల సంస్థ అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేసి రూ.44 కోట్ల విలువైన ధాన్యాన్ని తిరిగి రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

దాడిలో గాయపడ్డ పాత ఉట్నూర్‌కు చెందిన రాథోడ్ మోహన్(51) శుక్రవారం మృతి చెందాడు. కొత్త ఇంటి నిర్మాణంలో భాగంగా మట్టిని తొలగించే సమయంలో దారి వదల్లేదని రెండు రోజుల క్రితం రాథోడ్ మోహన్‌పై రాజు ఆయన భార్య హారిక దాడి చేశారు. దాడిలో మోహన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా, డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. శుక్రవారం మృతి చెందాడు. ఆయన భైంసా ఆర్‌డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించేవాడు. రాజు, హారికను అదుపులోకి తీసుకున్నామని సీఐ మొగిలి తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్ : మద్యం మత్తులో వ్యక్తి ఉరేసుకొన్ని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని యాపల్‌గూడలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనికి చెందిన బండి పోతన్న(56) మేస్త్రి పని చేస్తుండేవాడు. తాగుడుకు బానిసై ఇంట్లో నుంచి వెళ్లిపోయి యాపల్‌గూడ గ్రామ శివారులో వేపచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్టు హెడ్ కానిస్టేబుల్ పత్యాసింగ్ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్టు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 5871 మంది విద్యార్థులు పరీక్షలు రాయల్సి ఉండగా వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 3420 మంది, 2451 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సారి ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలను ఒకే రోజు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. తొలిరోజు జరిగిన లాంగ్వేజీ పేపర్ 1 పరీక్షకు ప్రథమ సంవత్సరంలో 1398 విద్యార్థులకు 1311 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 87 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 529 మంది విద్యార్థులకు 482 మంది విద్యార్థులు హాజరుకాగా 47 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రవీందర్‌కుమార్ తెలియజేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

నవతెలంగాణ-వేమనపల్లి

నూతన సాంకేతిక పరిజ్ఞానం (సీఈఐఆర్)తో పోగొట్టుకున్న ఫోన్లను వెతికి పట్టుకోవడంలో నీల్వాయి పోలీసులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. మండలంలోని కల్మలపేట గ్రామానికి చెందిన కొత్తూరి మధుకర్, జాజులపేట గ్రామానికి చెందిన దుర్కే ప్రవీణ్ ఇటీవల వేర్వేరుచోట్ల తమ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక నీల్వాయి పోలీసులను ఆశ్రయించి తమ ఫోన్లు పోయాయని ఫిర్యాదు చేశారు. వేర్వేరుగా కేసులు నమోదు చేసిన పోలీసులు సెంట్రల్ ఎక్విపమెంట్ ఐడెంటింటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అప్లికేషన్ ఉపయోగించి పోయిన ఇద్దరి సెల్‌ఫోన్లను వెతికి పట్టుకున్నారు. ఈ క్రమంలో ఎస్ఐ శ్యామ్ పటేల్ బాధితులను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఫోన్లను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్న ఎడల పోలీస్‌స్టేషన్ సంప్రదించి గాని, దగ్గరలోని మీ సేవ కేంద్రాల్లో గాని అట్టి ఫోన్‌కు సంబంధించిన వివరాలు బాధితుని ఆల్టర్నేట్ మొబైల్ నెంబర్ నమోదు చేసినట్లయితే ఫోన్ వెతికి పట్టుకొని బాధితులు అప్పగించడం జరుగుతుంది కావున ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

ఏకరూప దుస్తులు పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీకి తీసుకుంటున్న చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఏకరూప దుస్తుల పంపిణీకి జిల్లాలో అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా తరగతుల వారీగా జూన్ 12న ప్రతి విద్యార్థికి ఉచితంగా జత ఏకరూప దుస్తులు, పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 52,264 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్నారని అందులో బాలికలు 28,319, బాలురు 23,945 మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటికే మండలాల వారీగా ఏకరూప దుస్తుల క్లాత్‌ను పంపిణీ చేయడం జరిగిందని, మున్సిపాలిటీలలో మెప్మా గ్రామీణ ప్రాంతాలలో డీఆర్డీఓ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ మహిళలతో దుస్తులను కుట్టించడం జరుగుతున్నదని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు స్టిచ్చింగ్ సెంటర్లను పర్యవేక్షించి, రిపోర్టులను అందజేయాలని సూచించారు. అనంతరం పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటివరకు స్టిచ్చింగ్ సెంటర్లు, కుట్టిన దుస్తుల సంఖ్య ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో ఆర్డీఓ రత్నకల్యాణి, డీఈఓ రవీందర్‌రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ గోవింద్, డీపీఓ శ్రీనివాస్, సీపీఓ బాబురావు, సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, మనోహర్, మెప్మా పీడీ సుభాష్, అధికారులు, ఎంఈఓలు, ఏపీఎం పాల్గొన్నారు.

లైసెన్స్ దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లైసెన్స్ కలిగిన దుకాణాల్లో రైతులు విత్తనాలు, ఎరువులను కొనుగోళ్లు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో విత్తనాల మేళా నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. శాస్త్రవేత్తల పర్యవేక్షణలో తయారు చేసిన విత్తనాలను ప్రదర్శించారు. విత్తన రకం దిగుబడి తదితర వాటిని శాస్త్రవేత్తలు రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య మాట్లాడుతూ జిల్లాలో 518 షాపులకు లైసెన్స్‌లు ఇచ్చామని తెలిపారు. ఈ షాపుల్లోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లు చేయడంతో పాటు రశీదును తీసుకోవాలన్నారు. బిల్లులను భద్రంగా ఉంచాలని, ఏదైనా సమస్య వస్తే పరిహారం అందించడానికి సులువు అవుతుందన్నారు. జిల్లాలో నాలుగు లక్షల 50 వేల ఎకరాల్లో పత్తి సాగవుతున్నట్లు అంచన వేశామన్నారు. పది లక్షల ప్యాకెట్లు అవసరమని గుర్తించి 55 కంపెనీలతో మాట్లాడి 8 లక్షల ప్యాకెట్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 2 లక్షల 90 వేల ప్యాకెట్లు అమ్ముడుబోయినట్లు రికార్డులు చెబుతున్నాయని అన్నారు. 5 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని రైతులు తొందరపడవద్దని, ఆందోళన చెందొద్దని అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తయారు చేసిన విత్తనాలను వాడి మంచి దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ బీ.రాంప్రసాద్, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్, డాక్టర్ రాజేందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెర్సపేన్ దేవతకు తొడసం వంశస్థుల పూజలు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని బాబేఝరి, చిత్తగూడ గ్రామంలో శుక్రవారం పెర్సపేన్ దేవతకు తొడసం వంశస్థులు సంస్కృతి సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొడసం ఆడపడుచులు అల్లుండ్లు అందరూ కలిసి పెర్సపేన్ దేవత మండపం నిర్మాణం చేపడుతున్న సందర్భంగా రూ.1,10,351 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కఠోడ తొడసం బాపురావ్, కఠోడ తొడసం ఆనంద్‌రావ్, కఠోడ తోడసం రాజు పటేల్, తొడసం తెలంగ్‌రావ్ పటేల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, మాజీ ఎంపీపీ మెస్రం రూపదేవ్ పటేల్, మెస్రం శేఖర్ బాబు, తొడసం భీంరావ్, గోపాల్, యాదవ్ శావ్, గజానంద్, భగవత్‌రావ్, బాది పటేల్, మడావి నారంజి పటేల్, సుంగు, జైవంత్, మెస్రం శంకర్‌తో పాటు తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రంలోని భక్తులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

- రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి
- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రిజిస్టర్‌తో పాటు ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు అదిలాబాద్ మార్కెట్ యార్డ్‌లో 3,415 మంది రైతుల నుంచి 82వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్టు సెంట్రల్ ఇన్‌చార్జ్ పండరి తెలిపారు. ఇంకా 15 వేల క్వింటాళ్ల జొన్నలు రావచ్చని అంచనా వేశామని తెలిపారు.

ఇచ్చోడ మార్కెట్ యార్డు తనిఖీ...

అనంతరం ఇచ్చోడ మార్కెట్ యార్డ్‌ను తనిఖీ చేసి అక్కడ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 2,119 మంది రైతుల నుంచి 40వేల 5వందల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్టు సెంటర్ ఇన్‌చార్జ్ ఆర్.ఈశ్వర్ కలెక్టర్‌కు వివరించారు. వర్ష సూచనలు ఉన్నందున అధికారులు రైతులకు ఇబ్బంది కలుగకుండా ఈనెల 31వ తేదీ వరకు కొనుగోళ్లు జరపాలని ఆదేశించారు.

జొన్నలు తరలింపులో జాప్యానికి తావుండొద్దు..

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జొన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను రిజిస్టర్‌లతో పాటు ఆన్ లైన్ విధానాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? ధాన్యానికి తరుగు ఏమైనా తీస్తున్నారా అని ఆరా తీశారు. రైతులు జొన్నలు తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని అధికారులకు సూచించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే లారీలలో లోడ్ చేయించి, రైతుల నుంచి ధాన్యం తీసుకున్న వెంటనే టోకెన్‌లు అందించాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్‌లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాల కురుస్తున్నందున రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా జొన్నలను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా సహకార అధికారి బి మోహన్, మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.